సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం • 20 • మార్చి • 2024



కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలి
మేధావులు, విద్యావంతులు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని వర్రె వెంకటేశ్వర్లు కోరారు. - 8లో



రూ.4.76 లక్షలు స్వాధీనం
రాష్ట్ర సరిహద్దు రామాపురం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు రూ.4.76 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-33 (బుధవారం సా॥)
సహర్ 4-58 (గురువారం ఉ॥)

న్యూస్‌రీల్

యాదాద్రిలో మాజీ మంత్రి పూజలు



మాజీ మంత్రికి ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కుటుంబ సభ్యులు మంగళవారం సందర్శించారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా పూజలందుకుంటున్న శఆంజనేయస్వామికి మంగళవారం ఆచార్యులు ఆకుపూజ విశేషంగా నిర్వహించారు. అంజనీపుత్రుడు హనుమంతుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో ఆకు పూజను జరిపించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు.

మద్యం దుకాణాల్లో రికార్డుల పరిశీలన



మద్యం దుకాణంలో స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మోత్కూరు : మోత్కూరు పట్టణంలోని నాలుగు మద్యం దుకాణాలను మంగళవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాల రికార్డులను పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కోడ్‌కు విరుద్ధంగా దుకాణదారులు వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మోత్కూరు ఎక్సైజ్ సీఐ కాయితి రవిచంద్రారెడ్డి, ఎస్ఐ క్రాంతి, సిబ్బంది కృష్ణ తదితరులున్నారు.

రెండో రోజు 9,092 మంది విద్యార్థులు హాజరు

భువనగిరి : జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. రెండో రోజు ద్వితీయ భాష(హిందీ) పరీక్ష జరిగింది. పరీక్ష నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 51 కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగింది. ఆయా కేంద్రాల్లో 9,117 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 9,092 మంది హాజరు కాగా 25మంది గైర్హాజరైనట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు. గుండాలలో పరీక్ష కేంద్రాన్ని డీఈఓ తనిఖీ చేశారు.

గర్భకోశ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

తుర్కపల్లి: పశువుల్లో గర్భకోశ వ్యాధులు రాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ సదానందం సూచించారు. మంగళవారం తుర్కపల్లి మండలంని మాదాపూర్ గ్రామ పరిధిలోని కేవ్ల తండాలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. పశువుల్లో వచ్చే వ్యాధులను త్వరితగతిన గుర్తించి చికిత్స అందజేయాలన్నారు. పశువుల్లో వచ్చే గర్భకోశ, సీజనల్, గాలికుంటు వ్యాధులకు చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీనివాస్‌రావు, డాక్టర్, జానార్దన్, సిబ్బంది రాఘవేందర్, శంశోద్దీన్, ప్రవీణ్, గజేంద్ర, సింధల్ కుమార్ పాల్గొన్నారు.



నేత్రపర్వంగా దివ్య విమాన రథోత్సవం
యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ప్రధానాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి దివ్యవిమాన రథంపై ఊరేగుతున్న స్వామివారు, వేడుకలో పాల్గొన్న భక్తులు

తిరిగి వచ్చేశారు!

వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లు రద్దుచేసినా.. అమలుకాని ఆదేశాలు

- స్వస్థలాలకు వెళ్లినట్టే వెళ్లి తిరిగి వచ్చిన పలువురు ఉద్యోగులు
- తప్పుడు నివేదికలతో తమకు అనుకూలంగా మార్చుకుంటున్న సిబ్బంది
- ఉన్నతాధికారులతో అంతర్గత ఒప్పందం చేసుకుని యాదాద్రిలోనే విధుల నిర్వహణ



భువనగిరిటౌన్ : వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ఇచ్చిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఉన్నతాధికారుల అండదండలతో కొందరు ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. యాదాద్రిలోనే పనిచేయడానికి నిబంధనలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వర్క్ ఆర్డర్లు, డిప్యుటేషన్లను రద్దు చేస్తూ ప్రభుత్వం గత నెల 7న నిర్ణయం తీసుకుంది. హెల్త్ సెక్రెటరీ ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. అయితే, ఈ ఆదేశాలను పట్టించుకోకుండానే కొంత మంది ఉద్యోగులు వైద్యారోగ్యశాఖ ఆస్పత్రి అధికారులు, మెడికల్ ఆఫీసర్ల సహకారంతో డిప్యుటేషన్లలో కొనసాగుతున్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చి ఆరోగ్యంగా ఉన్నవారు సైతం తిరిగి డిప్యుటేషన్ స్థానాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు.

90శాతం మంది ఉద్యోగులు..
ఇటీవల ఇచ్చిన ఉత్తర్వుల్లో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు ఇతర కేడర్ అందరికీ డిప్యుటేషన్లు రద్దు చేస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారు. అధికారులు ఇంటర్నల్ వర్క్ ఆర్డర్లు, డిప్యుటేషన్లు ఇచ్చినా ఒరిజినల్ పోస్టులకు పంపించాల్సిందేనంటూ వైద్యారోగ్యశాఖ అధికారులు ఆదేశాలిచ్చారు. ఉద్యోగులు సొంత స్థలాలకు వెళ్లారా? లేదా? అనేది మానిటరింగ్ చేయాలని డీఎంహెచ్‌ఓలకు ప్రభుత్వం సూచించింది. కానీ పది రోజుల్లో స్వస్థలాలను వదిలి తిరిగి జిల్లాకు వచ్చేశారు.

40మంది ఇక్కడికే..
వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా వ్యాప్తంగా డిప్యుటేషన్‌పై కొనసాగుతున్న 50మంది ఉద్యోగులు నిబంధనల ప్రకారం స్వస్థలాలకు వెళ్లారు. ఇటీవల వీరిలో 40మంది జిల్లాకు తిరిగి వచ్చేశారు. కొందరు ఉద్యోగులు డీఎంహెచ్‌ఓ, ఎంఓ (మెడికల్ ఆఫీసర్లతో) ఇంటర్నల్ ఒప్పందాలతో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. మరి కొందరు తమ పలుకుబడిని ఉపయోగించి ఎఫ్‌ఎస్‌ఈలు (ఫారెన్ డిప్యూటేషన్ సర్వీస్) కింద కన్వర్ట్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. రాజకీయ పలుకుబడి ఉన్నోళ్లకు ఎఫ్‌ఎస్‌ఈలు ఇవ్వడమేమిటని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఆరోగ్య శాఖ అధికారులు ఇష్టారీతిలో డిప్యుటేషన్లు, ఎఫ్‌ఎస్‌ఈలకు సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ విషయంపై వివరణ కోరేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫోన్ చేస్తే ఆయన కూడా స్పందించలేదు.

యాదాద్రి ఎందుకు మక్కువంటే..
హైదరాబాద్ కూతవేటు దూరంలో ఉండడంతో పాటు కొంత మంది అధికారులు భువనగిరి పట్టణంలో సొంత వ్యాపారం పెట్టుకున్నారు. ప్రభుత్వం ఉద్యోగం చేస్తూ మరో ఉద్యోగం చేస్తున్న వారు ఇంకొంత మంది ఉన్నారు. ఈ క్రమంలో జిల్లాలో ఉండేందుకు ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు. వీరికి జిల్లా ఉన్నత అధికారులు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

సిస్టమ్ పోర్టల్‌లో నమోదు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే. జెండగే

సాక్షి,యాదాద్రి : ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేసిన వాటిని ఎలక్షన్ సీజర్ మేనేజిమెంట్ సిస్టమ్ పోర్టల్ (ఈఎస్ఎంఎస్)లో నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే నోడల్ అధికారులకు సూచించారు. మంగళవారం కాన్ఫరెన్స్ హాలులో ఎలక్షన్ సీజర్ మేనేజిమెంట్ సిస్టమ్ యాప్, వెబ్ పోర్టల్ వినియోగంపై పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు, స్టాటిస్టికల్ సర్వైలెన్స్ టీముల నిఘా, పర్యవేక్షణలో పట్టుకున్న డబ్బు, మద్యం, బంగారం, డ్రగ్స్ విలువైన వస్తువుల వివరాలను పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ పోలీసు కమిషనర్ రాజేశ్ చంద్ర, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టరు గంగాధర్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, సీపీఓ వెంకటేశర్లు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రామకృష్ణ, స్టేట్ సేల్ టాక్స్ అధికారి పద్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, ఇ. డిస్ట్రిక్ట్ మేనేజర్ సాయి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్
భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ హనుమంతు కె జెండగే సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్ రాజారెడ్డిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం సోమవారం కోతులు వెంబడించడంతో పాఠశాల భవనంపై నుంచి దూకిన ఘటనలో గాయపడిన విద్యార్థిని మనోజ్ఞను పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బందిని ఏర్పాటు చేసి కోతుల బెడద నుంచి రక్షణ కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈయన వెంట తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్లు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు కే. జెండగే

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

అదనపు కలెక్టర్ గంగాధర్

బొమ్మలరామారం : ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు ఉండేలా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ సూచించారు. బొమ్మలరామారం మండలంలోని నాగినేనిపల్లి, చీకటిమామిడి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. దివ్యాంగులు, వృద్ధులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్ఓ శ్రీనివాస్, పలువురు పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు

- సగానికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తయిన ప్రక్రియ
- 23వ తేదీలోగా కమిటీలను ఏర్పాటు చేసుకుని బ్యాంకు ఖాతాలు తెరవాలని అధికారుల నిర్ణయం
- పాఠశాలల్లో వసతుల కల్పనకు పనిచేయనున్న కమిటీలు



మునిపంపులలో అమ్మ ఆదర్శ కమిటీ ఏర్పాటుకు హాజరైన మహిళలు

రామన్నపేట : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే జిల్లాలో సగానికిపైగా పాఠశాలల్లో కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటుకు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు పాఠశాలల నిర్వహణ బాధ్యతను చేపట్టనున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 481 ప్రాథమిక, 68 ప్రాథమికోన్నత, 163 ఉన్నత, 11 కేజీబీవీ, 7మోడల్ స్కూళ్లు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

కమిటీల ఏర్పాటు ఇలా..
గ్రామాల్లో సంఘబంధం అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. పట్టణాల్లో పాఠశాల ఏరియా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా ఉంటారు. ప్రతీ తరగతి నుంచి ముగ్గురు తల్లులను సభ్యులుగా ఎన్నుకుంటారు. ముగ్గురిలో ఒకరు తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారై ఉండాలి. తరగతుల వారీగా సభ్యులుగా ఎన్నికైన మహిళలు గ్రామంలోని ఏదేని ఒక మహిళా సంఘంలో సభ్యురాలై ఉండాలి. చైర్‌పర్సన్, కన్వీనర్‌ల పేరున బ్యాంక్ జాయింట్ అకౌంట్ తీయబడుతుంది. ఈనెల 23వ తేదీలోగా కమిటీల ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసి, బ్యాంకు ఖాతాలను తెరువాలని అధికారులు నిర్ణయించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కమిటీలు పనిచేయాలి.

కమిటీలు చేసే పనులు
అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు పాఠశాలల్లో పలు రకాల పనులు చేపట్టనున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంలో ఏర్పాటు అవుతున్న కమిటీలు పాఠశాలల నిర్వహణలో పాలు పంచుకోనున్నాయి. పాఠశాలల పర్యవేక్షణ, పాఠశాలలను బలోపేతం చేయడం, తాగునీటి సౌకర్యం, మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుద్దీకరణ, పారిశుద్ధ్యం నిర్వహణ, విద్యార్థుల యూనిఫారాలు కుట్టించేపని తదితర అంశాలను ఈ కమిటీలు చేపట్టనున్నాయి.

యాదగిరిగుట్టలో గంజాయి ఘాటు

- పొరుగు జిల్లాల నుంచి సరఫరా
- యాదగిరిగుట్ట పట్టణం, గ్రామ శివారు ప్రాంతాల్లో జోరుగా వ్యాపారం
- ప్యాకెట్‌ల రూపంలో విక్రయాలు
- యువకులు, విద్యార్థులే టార్గెట్

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట ప్రాంతంలో పలు సంఘటనలు పరిశీలిస్తే గంజాయి గుప్పుమంటున్న తీరును తేటతెల్లం చేస్తోంది. యాదగిరిగుట్ట పట్టణంతో పాటు గ్రామ శివారు ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకొని అక్రమ వ్యాపారం నడుపుతున్నారు. యువకులు, కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సరదాగా మొదలైన గంజాయి వినియోగం వ్యసనంగా మారి తమ ఉజ్వల భవిష్యత్తును ఛిద్రం చేసుకుంటున్నారు.

ప్యాకెట్లలో నింపి అమ్మకాలు
హైదరాబాద్ – వరంగల్ జిల్లాల మధ్యలోనే ఉన్న యాదగిరిగుట్ట ప్రాంతానికి పలు మార్గాల ద్వారా గంజాయి సరఫరా అవుతున్నట్లు తెలుస్తుంది. ప్రధానంగా జాతీయ రహదారులు, రైలు మార్గాలు ఉండడం వల్ల గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తీసుకొచ్చి ప్యాకెట్ రూపంలో అమ్ముతున్నారు. యాదగిరిగుట్ట పట్టణం, యాదగిరిగుట్ట మండలంలోని మహబూబ్‌పేట, చొల్లేరు, వంగపల్లి, మల్లాపురం, యాదగిరిపల్లి, పెద్దకందుకూరు, రామాజీపేట, గౌరాయపల్లి, మాసాయిపేట, సాధువెల్లి, సైదాపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో గంజాయి విక్రయాలు జరుగుగున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ప్యాకెట్ రూ.500 నుంచి రూ.1000, పావు కిలో రూ.3,500 అర్ధకిలో రూ.6,500, కిలో రూ.13,000 వరకు అమ్ముతున్నట్లు తెలుస్తుంది.



మహబూబ్‌పేటలో గంజాయిని సిగరెట్‌లో పెట్టి వినియోగించిన యువకులు



మహబూబ్‌పేట శివారులో గంజాయిని పీల్చేందుకు వినియోగించిన బాటిళ్లు

గంజాయి ప్యాకెట్‌లను కొనుగోలు చేసిన యువత.. వివిధ రూపాల్లో సేవిస్తూ మత్తులో తూగుతున్నారు. పోలీసులు నిఘా పెట్టినా, తనిఖీలు నిర్వహిస్తున్నా గంజాయి దందాకు అడ్డుకట్ట పడడం లేదు.

గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ కొన్ని ఘటనలు

- ఈ ఏడాది జనవరిలో రాయగిరి నుంచి యాదగిరిగుట్ట పట్టణానికి ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.అతని నుంచి కిలో 360 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- గత సంవత్సరం డిసెంబర్‌లో పాతగుట్ట చౌరస్తాలో యాదగిరిగుట్ట పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద 129 గ్రాముల గంజాయి పట్టుబడింది.
- నాలుగు నెలల క్రితం ఆలేరు రైల్వే స్టేషన్‌లో ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆలేరు ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా సుమారు 2 కిలోల గంజాయి బిస్కెట్‌లు పట్టుబడ్డాయి.
- గత సంవత్సరం ఆగస్టులో యాదగిరిగుట్ట పట్టణంలోని అంగడిబజార్‌లో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డారు.

గ్రామాల్లో నిఘా పెట్టాం



విద్యార్థులు, యువత గంజాయి వంటి మత్తు పదార్థాల బానిసలై తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. గంజాయి విక్రయించినా, సేవిస్తూ పట్టుబడినా ఉపేక్షించేది లేదు. ఆలేరు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో నిఘా పెట్టాం. తనిఖీలు నిర్వహిస్తున్నాం. గంజాయి సేవించడ వల్ల కలిగే దుష్పరిణామాలపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.
–దీపిక, ఎక్సైజ్ సీఐ, ఆలేరు

కఠిన చర్యలు ఉంటాయి



గంజాయితో పట్టుబడిన వ్యక్తులను నేరుగా టీఎస్ నాబ్ టీమ్ వారు నేరుగా ఇన్వెస్టిగేషన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. యువత, విద్యార్థులు అటు వైపుగా వెళ్లకూడదు. గంజాయికి బానిసలు అయితే సామాజికంగా, ఆర్థికంగా నష్టపోతారు. గంజాయి మత్తులో యువత నేరాలకు పాల్పడుతోంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కదలికలను గమనిస్తుండాలి.
– రమేష్, సీఐ, యాదగిరిగుట్ట

దేవుడు మంచి మార్గాన్ని చూపిస్తాడు

- త్రిదండి చిన జీయర్‌స్వామి



రాములబండలో మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి

నల్లగొండ రూరల్ : ప్రతి అణువులో దేవుడు ఉండి మంచి మార్గాన్ని చూపిస్తాడని త్రిదండి చిన జీయర్ స్వామి అన్నారు. సోమవారం రాత్రి నల్లగొండ మండలంలోని రాములబండలో పురాతన సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అయన నూతన రథాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ప్రజలు భక్తి భావంతో మెలగాలన్నారు. ఈ దేవాలయం 300 ఏళ్ల క్రితం నిర్మించినట్లు తెలుస్తోందన్నారు. ఇంతటి ప్రాచీన దేవాలయంలో పూజలు చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. దోమలపల్లి వంశస్తులు నాలుగు తరాలుగా స్వామివారి సేవలో తరిస్తున్నారని కొనియాడారు. వార్షిక బ్రహ్మోత్సవాలను దేవుడి పుట్టుక సందర్భంగా నిర్వహిస్తారన్నారు. మొదటిసారిగా బ్రహ్మోత్సవాలను శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నిర్వహించారన్నారు. ప్రతి ఒక్కరూ రాముడి చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. దేవస్థానం చైర్మన్ కెప్టెన్ దోమలపల్లి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 22న ఉదయం 6 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. రాత్రి 11 గంటలకు కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దోమలపల్లి ప్రభాకర్‌రావు, అమరేందర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించుకోవాలి

ఆత్మకూరు(ఎం): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. మంగళవారం ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వాలను పూర్తి చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి జెట్ట రాములు, నాయకులు జల్ది రాములు, చెక్క వెంకటేశ్వర్లు, భారతమ్మ, మారుపాక వెంకటేశం, సోలిపురం లింగారెడ్డి, జక్క దయాకర్‌రెడ్డి, సుల్తాన్ పురుషోత్తం, గుగ్రం రాజమణి, ఎల్లంకి మహేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

- బూర నర్సయ్యగౌడ్



మాట్లాడుతున్న డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

భువనగిరి : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న డాక్టర్ బూర నర్సయ్య గౌడ్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం ఇప్పటి నుంచి ఓటర్లను కలిసి కేంద్రం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, పథకాల గురించి వివరించాలన్నారు. సమావేశంలో భువనగిరి పార్లమెంటరీ ప్రభారీ పాపారావు, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, నాయకులు పడమటి జగన్మోహన్‌రెడ్డి, పోతంశెట్టి రవీందర్, దాసరి మల్లేశం, డీఎల్ఎన్‌గౌడ్, లావణ్య, వైజయంతి, శ్యాంసుందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్, జనగాం నర్సింహాచారి, నీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దొంగతనం కేసులో నిందితుడికి జైలుశిక్ష

నల్లగొండ క్రైం: బైక్ దొంగతనం చేసిన నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం నల్లగొండ కోర్టు అడిషనల్ జడ్జి కేవీఎస్ హరీష్‌బాబు తీర్పు వెలువరించినట్లు నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ గ్రామానికి చెందిన సంపంగి నాగేష్ కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ చోరీ చేశాడు. నాగేష్‌పై కొండమల్లేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి ఆధారాలు కోర్టుకు సమర్పించారు. ఈ కేసు విచారణలో భాగంగా సాక్ష్యాధారాలు పరిశీలించిన నల్లగొండ కోర్టు అడిషనల్ జడ్జి నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో సహకరించిన అప్పటి కొండమల్లేపల్లి ఎస్‌ఐ పి. వీరబాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రూపాంజలి, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ, ఎస్‌ఐ రామ్మూర్తి, సీడీఓ వై. నగేష్, డి. శ్రావణ్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

గణపతి విగ్రహానికి ఏర్పాటు చేసిన మండపం ధ్వంసం



మండపాన్ని కూల్చివేసిన దుండగులు

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని శివాలయం వీధిలో గల కాకతీయుల నాటి గణపతి విగ్రహానికి ఏర్పాటు చేసిన మండపాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఏడాది క్రితం ముళ్లపొదల మధ్య కూరుకుపోయిన గణపతి విగ్రహాన్ని పరిరక్షించి తాత్కాలికంగా మండపాన్ని ఏర్పాటు చేశారు. ఈ మండపాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గణపతి విగ్రహ కమిటీ ప్రతినిధులు బ్రహ్మదేవర రవిశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

కనగల్ : రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని లచ్చుగూడెం స్టేజి సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ (స్కూల్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న సాజిద్ ఆలీ గుర్రంపోడులోని ఆదర్శ పాఠశాలలో పదోతరగతి పరీక్షల విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో విధులు ముగించుకుని నల్లగొండ పట్టణానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న గడ్డిట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా చనిపోయిన విషయం వాస్తవం కాగా పోలీస్‌స్టేషన్‌లో తమకు ఫిర్యాదు అందలేదన్నారు. మృతుడి భార్య 6నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందినట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో రైతు షేక్ సలీమ్‌కు చెందిన 5ఎకరాల వరిగడ్డి వాములు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సలీమ్ తన 5ఎకరాల వరిపొలం కోయగా వచ్చిన వరిగడ్డిని తమ ఇంటికి సమీపంలో వాములుగా వేసుకున్నాడు. కాగా మధ్యాహ్న సమయంలో అకస్మాత్తుగా వరిగడ్డివాములు నుంచి మంటలు చెలరేగాయి. గమనించి స్థానికులు, గ్రామపంచాయతీ వాటర్‌ట్యాంకర్ సహాయంతో మంటలు ఆర్పివేసేందుకు ప్రయత్నించాం. ఫైరింజన్, అధికారులు, హుజూర్‌నగర్ నుంచి వచ్చేసరికి పూర్తిగా దగ్ధమైంది. రూ.40వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

కనుల పండువగా దివ్య విమాన రథోత్సవం

- తిరుమాడ వీధుల్లో విహరించిన కల్యాణమూర్తులు
- ఉదయం గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువుగా ఊరేగిన స్వామి, అమ్మవారు



దివ్య విమాన రథోత్సవం ముందు అర్చకులు, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అధికారులు తదితరులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి లక్ష్మీదేవిని నృసింహస్వామి పరియణమాడగా.. మంగళవారం ఉదయం ఆలయంలో నిత్యారాధనల అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై శ్రీమహావిష్ణు అలంకార సేవలో మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ తూర్పు రాజగోపురం ముందు సేవను వేంచేపు చేసి వేద పారాయణం పఠించారు. అనంతరం అలంకార విశిష్టతను ప్రధానార్చకులు వివరించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అర్చకులు, పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్య విమాన రథంపై..

సాయంత్రం ఆలయంలో నిత్యారాధనలు జరిపించిన అనంతరం చతుస్థానార్చనలు, మండపారాధనలు, మూలమంత్ర జపములు, ద్వార తోరణ పూజలు, దివ్య ప్రబంధ పారాయణాలు, మహామంత్ర పుష్ప పఠనాదులు, పురాణ, ఇతిహాస, విజ్ఞాపనలు నిర్వహించారు. అనంతరం రథాంగ హోమం, రథబలి, ఉత్సవమూర్తుల అలంకార సేవ ఊరేగింపు గావించారు. రాత్రి స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో దివ్య విమాన రథంపై ఊరేగించారు. దివ్య విమాన రథోత్సవానికి ముందు ఆలయ మాడ వీధుల్లో స్థానిక యువకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కేరింతలు, నృత్యాలతో సందడి చేశారు. కొండపైన రథోత్సవం సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు మహాపూర్ణాహుతి, దేవతోద్వాసన..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, రాత్రి వేళ శ్రీపుష్ప యాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవాలు జరిపిస్తారు.

కొనసాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం శ్రీశబరిగిరీశ అయ్యప్ప బృందం, శివరామకృష్ణ భజన మండలి, భాగ్యలక్ష్మి మహిళా భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. అనంతరం వెంపరాల వెంకటలక్ష్మీ శ్రీనివాసమూర్తిచే భాగవతాంర్గత నృసింహాతత్వ ఉపన్యాసం నిర్వహించారు. శారద భాగవతారిణిచే ధృవ చరిత్ర అను హరికథాగానం చేశారు. సాయంత్రం శారద సంగీత విద్యాలయం వారిచే భక్తి సంగీత కార్యక్రమం, డాక్టర్ డి.వి.మోహన్‌కృష్ణచే కర్ణాటక సంగీత కార్యక్రమం, కుమారి వైష్ణవి గోపాల్‌చే వీణా వాద్యం జరిగింది. అనంతరం విశ్వజ, విష్ణుజ, సమతుల్య యోగా కూచిపూడి డ్యాన్స్, ఆర్.వి.ఎస్.ఎన్.వి సోమయాజులు, వేదాంతం కూచిపూడి డ్యాన్స్ అకాడమీ, భరద్వాజ నాట్యాలయం, డాక్టర్ నవ్య నాగబండి, నాట్య మయూరి డ్యాన్స్ అకాడమీలచే కూచిపూడి నృత్య ప్రదర్శన, గడ్డం సుదర్శన్‌చే చిందు యక్షగానం చేశారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి చెక్క భజన మండలి–శాపెల్లి వారిచే చెక్క భజన, పాల బిందెల బాలు–నల్లగొండ, లక్ష్మీ శ్రీనివాస కోలాట భజన మండలి–హైదరాబాద్, సాంస్కృతిక విశ్వకళా మండలి–రాంపల్లి వారి కోలాట బృందం స్వామి రథం ముందు కోలాటం ఆడారు.



గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువుగా ఊరేగుతున్న స్వామివారు



శాస్త్రీయ నృత్యం చేస్తున్న కళాకారులు

మేధావులు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలి

- సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వర్రె వెంకటేశ్వర్లు

ఆలేరురూరల్: మేధావులు, విద్యావంతులు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు కోరారు. ఆలేరు పట్టణ కేంద్రంలోని కేవైఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి, ప్రేమ సేవా సదనం డైరెక్టర్ మహమ్మద్ ఖుర్షీద్ పాషా అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్రె వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఆర్టీఐ చట్టం నిర్వీర్యం అయ్యిందని, దాని ప్రక్షాళనకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి జీఓను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా, ఆన్‌లైన్‌లో ఆర్టీఐ దరఖాస్తులు స్వీకంచేలా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో 16 కులాల కార్పొరేషన్ల ఏర్పాటుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేయడం గొప్ప విషయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ లోక్‌సభ స్థానాలు గెలిచే బాధ్యతను యువత, విద్యావంతులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండేందుకు, ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేందుకు గతంలో కాంగ్రెస్ హయాంలోనే సమాచార హక్కు చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా సమాజంలో జరుగుతున్న అవినీతిని బయటకు తీసేందుకు ఆర్టీఐ కార్యకర్తలు నిత్యం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మేధావులు, ఉద్యోగులు, జర్నలిస్టులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి లోక్‌సభ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. సమాచార హక్కు చట్టంలో రాజకీయ నాయకులు కూడా భాగస్వాములు కావాలని, ఆ దిశగా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సమాచార వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, ఆకవరం మోహన్‌రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, శివలింగం, సురేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



మిర్యాలగూడ టౌన్: పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

మిర్యాలగూడ టౌన్: 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం పరిధిలోని రైల్వే గోదాముల వెనుక లారీలో తీసుకు వచ్చిన పీడీఎస్ బియ్యాన్ని శుభ్రం చేస్తుండగా రూరల్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. బియ్యం శుభ్రం చేస్తున్న కూలీలను వివరాలు అడగగా.. కూలీ ఇస్తే బియ్యం శుభ్రం చేస్తున్నామని పేర్కొన్నారు. లారీతో పాటు 40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే పోలీసులు కూడా కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ హుస్సేన్ తెలిపారు. వారి వెంట సివిల్ సప్లయ్ ఆర్‌ఐ సురేందర్‌సింగ్, రూరల్ ఏఎస్‌ఐ ఉమాపతిరావు, సిబ్బంది ఏడుకొండలు తదితరులున్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం కన్నారెడ్డికుంట, ఇతర తండాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి తరలిస్తున్న 13 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

అధిక వడ్డీ ఆశ చూపి..

- బోర్డు తిప్పేసిన రియల్ ఎస్టేట్ సంస్థ
- రూ.5కోట్ల మేర మోసపోయిన కోదాడ, చిలుకూరు వాసులు
- లబోదిబోమంటున్న బాధితులు

కోదాడ: అధిక వడ్డీకి ఆశపడి సూర్యాపేట జిల్లా కోదాడ, చిలుకూరు ప్రాంతవాసులు హైదరాబాద్‌లోని ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పెట్టుబడి పెట్టగా.. ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో లబోదిబోమంటున్నారు. దాదాపు వంద మంది వరకు రూ.5కోట్ల మేర పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ పరిధిలోని నల్లచెరువు ప్రాంతంలో జేవీ బిల్డర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో వేలూరి లక్ష్మీనారాయణ, వేలూరి జ్యోతి ఎండీ, సీఎండీలుగా చెప్పుకొని ఓ రియల్ ఎస్టేట్ సంస్థను నడిపిస్తున్నారు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలికారు. పరిచయం ఉన్న వారిని ఏజెంట్లుగా పెట్టుకొని డబ్బులు వసూలు చేశారు. మొదట ప్రతి నెలా వడ్డీ చెల్లించడంతో పలువురు వీరిని నమ్మారు.

చిలుకూరు వాసి ద్వారా పెట్టుబడి పెట్టి..

హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న చిలుకూరుకు చెందిన ఓ వ్యక్తి, కోదాడకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇద్దరు కలిసి మొదట ఈ సంస్థలో పెట్టుబడి పెట్టారు. వీరికి అధిక కమీషన్ ఇవ్వడంతో పాటు ఏజెంట్లుగా మారి మరికొంత మందిని చేర్పిస్తే అదనపు తాయిలాలు ఇస్తామని చెప్పడంతో వారు చిలుకూరు, కోదాడకు చెందిన దాదాపు 100 మందిని సదరు సంస్థలో సభ్యులుగా చేర్పించినట్లు సమాచారం. ఒక్కొక్కరు రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఈ రియల్ ఎస్టేట్ సంస్థలో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రతి వారం కోదాడ నుంచి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ పూర్తయిన ఓ వెంచర్‌ను చూపి తాము అన్నీ ఇలా చేస్తామని పెట్టుబడి పెట్టిన వారికి నమ్మకం కలిగించినట్లు తెలుస్తోంది.

ఇలా ఆకర్షించారు..

తమ సంస్థలో రూ.10లక్షలు పెట్టుబడి పెడితే ప్రతి 15 రోజులకు రూ.20వేలు వడ్డీ చెల్లిస్తామని, దీంతో పాటు పెట్టుబడి పెట్టిన అసలులో ప్రతి నెలా రూ.లక్ష తిరిగి చెల్లిస్తామని చెప్పడమే కాకుండా వారికి నమ్మకం కలగడానికి వారి పేరు మీద కొన్ని ప్లాట్లు, వ్యవసాయ భూములను కూడా రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో పలువురు వీరి చేతిలో లక్షల రూపాయలు పోశారు. మొదట చేరిన వారు ఏజెంట్ల అవతారమెత్తి మరికొంత మందిని చేర్పించారు. రెండు మూడు నెలల వరకు చెల్లింపులు సక్రమంగానే చేసిన సంస్థ ఇప్పుడు బోర్డు తిప్పేయడంతో వారం తా రెండు రోజుల క్రితం ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. కోదాడ, చిలుకూరు ప్రాంత వాసులను చేర్పించిన ఏజెంట్లపై ఒత్తిడి పెరగడంతో వారు అజ్ఞాతంలోకి వెళ్లడంతో పాటు ఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేసుకోవడంతో బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సదరు సంస్థ బాధితులకు రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లు, భూములు కూడా వారివి కావని, అవన్నీ నకిలీ పత్రాలతో చేసినవని తేలడంతో వారు లబోదిబోమంటున్నారు. చిలుకూరు వాసులు రూ.4కోట్లు, కోదాడ వాసులు రూ.కోటి మేర పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు సమాచారం.

రెండు కుటుంబాల మధ్య పరస్పర దాడులు

భువనగిరి క్రైం: రెండు కుటుంబాల మధ్య పరస్పర దాడులతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం సాయంత్రం భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వడపర్తి గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్యకు చెందిన గేదెలు పక్కనే గల ఎలిమినేటి పద్మారెడ్డి వరి చేనులో మేస్తుండగా.. పద్మారెడ్డి గేదెలు మేస్తున్న సంఘటనపై సత్తయ్యను ప్రశ్నించి దూషించాడు. సత్తయ్య కుమారుడు బాల మల్లేష్ పద్మారెడ్డి పైకి వెళ్లగా అదే సమయంలో పద్మారెడ్డి తన చేతిలో ఉన్న కొడవలితో మల్లేష్‌పై దాడి చేశాడు. ఇది గమనించిన బాల మల్లేష్ తండ్రి సత్తయ్యతో పాటు సోదరుడు బాలకృష్ణ పద్మారెడ్డి, కుమారుడు సంతోష్‌రెడ్డిపై దాడికి దిగారు. ఇరు కుటుంబాలకు చెందిన వారి ఘర్షణలో పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా సత్తయ్య, బాలకృష్ణ, బాలమల్లేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అడ్డుగా వచ్చిన పద్మారెడ్డి భార్య కమలమ్మకు సైతం గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఇరు వర్గాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

మద్యం పట్టివేత

కేతేపల్లి: మండల కేంద్రంలోని బెల్టు దుకాణాలపై మంగళవారం పోలీసులు దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండల కేంద్రంలోని పాత ఏపీజీవీబీ బ్యాంక్ పక్కన జోజప్ప అనే వ్యక్తికి చెందిన కిరాణ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 8 బీరు బాటిళ్లు, 19 మద్యం బాటిళ్లు పోలీసులు సీజ్ చేశారు. జోజప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం చిన్నసూరారం గ్రామంలో బెల్టు షాపులో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఫ్లయింగ్ సర్వేలైన్స్ టీం తిప్పర్తి మండల ఇన్‌చార్జి సీహెచ్. జానయ్య ఆధ్వర్యంలో చిన్నసూరారం గ్రామంలో తనిఖీలు చేస్తుండగా జక్కలి సతీష్‌కు చెందిన బెల్టు షాపులో 14 బీర్లు, 10 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

మునుగోడు: అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్న ముగ్గురిపై మునుగోడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలోని పలివెల, రామక్రిష్ణాపురం, దుబ్బకాల్వ గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి పోలీసులు వెళ్లి సోదాలు చేయగా ముగ్గురి వద్ద మద్యం పట్టుకున్నారు. పట్టుబడిన మద్యాన్ని సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనాల తనిఖీల్లో రూ.4.76 లక్షలు స్వాధీనం



వాడపల్లి చెక్‌పోస్ట్ వద్ద నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోదాడ: మండల పరిధిలోని రామాపురం చెక్‌పోస్ట్ వద్ద కోదాడ రూరల్ పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4,76,900 సీజ్ చేసినట్లు సంబంధిత కోదాడ రూరల్ ఎస్‌ఐ అనల్‌రెడ్డి తెలిపారు. సీజ్ చేసిన డబ్బును ఎస్ఎస్‌టీ అధికారి వినయ్‌కుమార్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేల కంటే ఎక్కువ డబ్బు తీసుకెళ్లేవారు సంబంధిత పత్రాలను దగ్గర పెట్టుకోవాలని ఎస్‌ఐ సూచించారు.

వాడపల్లి చెక్‌పోస్ట్ వద్ద రూ.9.50 లక్షలు..

మిర్యాలగూడ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మంగళవారం ఓ వ్యక్తి కారులో పరిమితికి మించి నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు వాడపల్లి ఎస్‌ఐ రవి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలంలోని వాడపల్లి శివారులో ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు పట్టణానికి చెందిన పెనక గోపినాథ్‌రెడ్డి తన కారు(టీఎస్ 07 ఎఫ్ఎల్ 4545)లో హైదరాబాద్ నుంచి నెల్లూరుకు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.9.50లక్షలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆ నగదును స్వాధీనం చేసుకుని మిర్యాలగూడ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మిర్యాలగూడలో రూ.84,290..

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా బొలేరో వాహనంలో వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.84,290 పట్టుకున్నట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపని కారణంగా పట్టుబడిన నగదును సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ రాంబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కేతేపల్లి టోల్‌ప్లాజా వద్ద రూ.1.99లక్షల నగదు సీజ్..

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీల్లో భాగంగా మంగళవారం ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.99లక్షలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు. చౌటుప్పల మండలం మందులగూడెం గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ ఎండీ అన్వర్ నుంచి రూ.99వేలు, కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన బొలెరో వాహన డ్రైవర్ ఖాజాపాషా నుంచి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. సీజ్ చేసిన నగదును నల్లగొండ ట్రెజరీలో డిపాజిట్ చేశామని వెల్లడించారు.

నార్కట్‌పల్లి : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎస్‌ఐ అంతిరెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలువురి నుంచి రూ.3లక్షల4వేల 500నగదు, రూ.32వేల 170 విలువ గల 74.460లీటర్ల మద్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

రామగిరి(నల్లగొండ), కట్టంగూర్: తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ శివారులో గల బోరు బావిలో సోమవారం శవమై తేలిని వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మృతుడు కట్టంగూర్‌కు చెందిన వనం ఈశ్వర్(33)గా పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియా, వార్తాపత్రికల ద్వారా విషయం తెలుసుకున్న మృతుడి భార్య నవ్య మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఈశ్వర్ ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడని తెలిసింది. శాలిగౌరారం సీఐ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వనం ఈశ్వర్ మృతితో కట్టంగూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

హత్య కోణంలో దర్యాప్తు..



మృతుడి కుటుంబ సభ్యులను విచారిస్తున్న శాలిగౌరారం సీఐ శ్రీనివాసరెడ్డి

ఈశ్వర్ మెడకు, కాళ్లకు తాళ్లు కట్టి ఉండడంతో పోలీసులు హత్యగా ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. హత్య ఎలా జరిగింది, ఎవరు చేశారు, ఎంత మంది పాల్గొన్నారు? అనే వివరాలు తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కుటుంబ సభ్యులు, తెలిసిన వారి వద్ద కొంత మేర సమాచారం రాబట్టారు. మృతుడి కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోంది. కాల్ డేటా వస్తే హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

కాపీ రైట్స్‌పై అవగాహన ఉండాలి

నల్లగొండ రూరల్: కాపీ రైట్స్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు జీబీ రెడ్డి, సాయి భవాని అన్నారు. మంగళవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో కాపీ రైట్స్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. కాపీ రైట్ చేసిన రచనలను ఇతరులు ప్రచురించడం, ప్రచారం చేసుకోవడం కాపీ రైట్ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు దోమల రమేష్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



భూక్య నాగు (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం కిష్టాపురం వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం లావూరి భీక్యతండాకు చెందిన సైదా, బుజ్జి దంపతులు వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. వీరికి కుమారుడు నాగు(22), కుమార్తె సంతానం. కుమార్తె వివాహం కాగా, కుమారుడి వివాహం కూడా ఈ వేసవిలో చేద్దామని అనుకున్నారు. నాగు శుభకార్యాలకు డెకరేషన్ పనులు చేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. సోమవారం నాగు దామరచర్ల మండలం బాలాజీనగర్ తండాకు చెందిన తన స్నేహితుడు రత్నావత్ దావీద్‌తో కలిసి డెకరేషన్ చేసేందుకు మిర్యాలగూడకు వచ్చాడు. డెకరేషన్ పనులు ముగించుకొని ఇరువురు బైక్‌పై తిరిగి వెళ్తుండగా మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై గుర్తుతెలియని వాహనం ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న దావీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నాగు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి బావ ధరావత్ సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుళ్లు

- మిర్యాలగూడలో అనధికారికంగా బాణాసంచా తయారీ



అనధికారికంగా నిర్వహిస్తున్న బాణాసంచా తయారీ కేంద్రంలో చెలరేగిన మంటలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌లో అనధికారికంగా బాణాసంచా తయారీ చేస్తున్న కేంద్రంలో మంగళవారం రాత్రి పేలుళ్లు సంభవించాయి. పట్టణానికి చెందిన ఓ టపాసుల వ్యాపారి పట్టణ శివారులోని బాపూజీనగర్‌లో రహస్యంగా బాణాసంచా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం రాత్రి బాణాసంచా తయారీ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే తయారీ కేంద్రంలోని ముడిసరుకు అంటుకోవడంతో పెద్ద శబ్దంతో కూడిన మంటలు, పొగలు వ్యాపించాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఏమి జరిగిందో తెలియక కాలనీ వాసులు పరుగులు తీశారు. పేపర్ ట్యూబ్ కంపెనీ పేరుతో షెడ్డును నిర్మించి అందులో కొంత కాలంగా బాణాసంచా తయారు చేస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించినా అగ్నిమాపక కేంద్రానికి గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వక పోవడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులే నీళ్లు చల్లి మంటలు ఆర్పారు. కానీ, అప్పటికే దాదాపు షెడ్డు పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక శాఖ అధికారి యాదగిరిని వివరణ కోరగా.. పట్టణంలో బాణాసంచా తయారీకి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, వివరాలు సేకరించి చర్య తీసుకుంటామన్నారు.

కండక్టర్‌పై దాడి.. రిమాండ్

రామన్నపేట: కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ రామన్నపేట అదనపు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. చందన మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు. వివరాలు.. ఈ నెల 15న శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి చౌటుప్పల్ మండలం జైకేసారం వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మద్యం మత్తులో కండక్టర్‌తో వాగ్వాదానికి దిగి అతడిపై దాడి చేశాడు. కండక్టర్ సి. నర్సింహ ఫిర్యాదుతో అదేరోజు రామన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం శ్రీనివాస్‌రెడ్డిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్‌ఐ తెలిపారు.